మార్కెట్‌కు శ్రావణ శోభ

- వరలక్ష్మీ వ్రతం సందర్భంగా రద్దీ
- పూజాసామాగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజల క్యూ
- కిటకిటలాడిన దుకాణాలు


కొనుగోలుదారులతో కిక్కిరిసిన కంబాలచెరువు సెంటర్


పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రకాశం నగర్: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గురువారం మార్కెట్ కిటకిటలాడింది. పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో వివిధ కూడళ్ల జనాలతో రద్దీగా మారాయి. కంబాల చెరువు మెయిన్ రోడ్డు, జాంపేట వంటి ప్రాంతాలు కొనుగోలుదారులతో జనసంద్రంగా మారాయి. చామంతి, గులాబీ, జాజీ పువ్వులు, అరటి తోరణాలు, పత్రి కట్టలు, మామిడి ఆకులు, కొబ్బరి కాయలు, అరటి, ఆపిల్, దానిమ్మ వంటి వివిధ రకాల పండ్లను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపారు. దీంతో వాటి ధరలు భగ్గుమన్నాయి.

బంగారం దుకాణాల్లో సందడి

పూజకు అవసరమైన వరలక్ష్మి అమ్మవారి ప్రతిమ (బంగారు రూపు)ను అమ్మవారి కలసానికి అలంకరిస్తారు. అటువంటి రూపులను అర గ్రాము, ఒక గ్రాము సైజ్‌లో తయారు చేసి విక్రయించేందుకు నగరంలోని ప్రధాన జ్యూయలరీ షాపులు ముందుగానే ఏర్పాట్లు చేసుకున్నాయి. కొందరు ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూపుల విక్రయాలు జరిపారు.

ఊపందుకున్న పువ్వుల విక్రయాలు

కడియం: శ్రావణ మాసం కావడంతో కడియపులంక పువ్వుల మార్కెట్ శోభను సంతరించుకుంది. కొన్నాళ్లుగా ముహూర్తాల్లేక పోవడంతో పువ్వుల రైతులు, వ్యాపారులు డీలా పడ్డారు. అయితే శ్రావణ మాసం , అందునా శుక్రవారం కావడంతో పువ్వుల అమ్మకాలు ఊపందుకున్నాయి. రెండు రోజులుగా పువ్వులు అమ్మకాలు, కొనుగోళ్లతో మార్కెట్ వద్ద రద్దీ ఏర్పడింది. మన రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఒడిశా, తెలంగాణాల్లోని పలు ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచి పువ్వులను ఎగుమతి చేస్తారు. కాగా వరద, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్థానికంగా పువ్వుల లభ్యత తగ్గింది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి పువ్వులను దిగుమతి చేసుకున్నారు. స్థానికంగా లభించే పువ్వుల కంటే, ఇలా దిగుమతి చేసుకున్న పువ్వులు కావడంతో ధరలు అధికంగా ఉంటున్నాయని వ్యాపారులు తెలిపారు. లిల్లీ, మల్లి, జాజులు, కనకాంబరం, నాటు గులాబీలు మాత్రమే ఇక్కడి రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. అయితే శ్రావణ మాసం వరలక్ష్మి పూజల్లో ప్రధానంగా వినియోగించే చామంతి, బంతి, అలంకరణ గులాబీలను మాత్రం తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి, కడియపులంక పువ్వుల మార్కెట్‌లో అమ్ముతున్నారు. దీంతో రేట్లు అధికంగానే ఉంటున్నాయి. గురువారం మార్కెట్‌లో చామంతులు కేజీ రూ. 450ల వరకూ పలికాయి. బంతి పువ్వులు రూ.70, లిల్లీలు రూ.300, మల్లి రూ.1100, జాజులు రూ.800, కాగడాలు రూ.800, స్టార్ గులాబీలు రూ.450, కనకాంబరం బారు రూ.300 పలికాయని వ్యాపారులు తెలిపారు.


కడియపులంక పువ్వుల మార్కెట్‌లో సందడి

గోదావరి ఘాట్లు సిద్ధం

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివస్తారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలోని అన్ని అమ్మవారి ఆలయాలలో ఉదయం నుంచి పూజలు నిర్వహించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేశారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- నగరంలో గడప గడపకూ..

రాజమహేంద్రవరం సిటీ: నవరత్న పథకాలతో పేదల ఇంటి సంక్షేమ వెలుగులు విరబూస్తున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. 49వ డివిజన్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి, గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇళ్ల పట్టాలకు సంబంధించి స్థానికులు అడగగా, శ్రీనివాస్ మాట్లాడుతూ బూరుగుపూడిలోని జగనన్న కాలనీపై కోర్టు కేసు పరిష్కారమైందని, పట్టాలు ఇచ్చిన వారందరికీ అతి త్వరలోనే స్థలాలను అప్పగిస్తామన్నారు. మౌలిక సదుపాయాల సమస్యలపై సంబంధిత అధికారులతో, సిబ్బందితో అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, 45వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కస్సే రాజేష్, నాయకులు గారా చంటిబాబు, తిరగట్టి దుర్గ, ఎస్కే ఖాన్ పాల్గొన్నారు.

మొక్కల సాగుకు శాస్త్రవేత్తల తోడ్పాటు

కడియం: మొక్కల సాగులో రైతులకు ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారానికి శాస్త్రవేత్తలు తమ వంతు తోడ్పాటు అందిస్తారని ఫ్లోరీ కల్చర్ రీసెర్చి సెంటర్ (పూణే) డైరెక్టర్ డాక్టర్ కేవీ ప్రసాద్ అన్నారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పలువురు శాస్త్రవేత్తల బృందంతో కలిసి కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలకు వ్యాపించే తెగుళ్లను నివారించేందు వేమగిరి డీఎఫ్ఆర్‌సీ బృందం సహకారాన్ని రైతులు తీసుకోవాలన్నారు. సంబంధిత తెగులు సోకిన మొక్కను కేంద్రం వద్ద అందజేస్తే వాటిని పరీక్షించి, ఆ తెగులు నివారణకు అనుసరించాల్సిన పద్ధతులను రైతులకు వివరిస్తారన్నారు. అనంతరం రైతుల సందేహాలకు డాక్టర్ ప్రసాద్, శాస్త్రవేత్తలు డీవీఎస్ రాజు, రాంపాల్, శిరీష, మదన్ సమాధానాలిచ్చారు. మట్టికి ప్రత్యామ్నాయంగా వినియోగించదగిన మీడియాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలని, నర్సరీల్లో వచ్చే అగ్రివేస్ట్‌ను కంపోస్టుగా తయారు చేసుకునేందుకు సులభమైన విధానాన్ని అభివృద్ధి చేయాలని పలువురు రైతులు శాస్త్రవేత్తలను కోరారు. అలాగే ప్రతినెలా ఫెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ఇరిగేషన్, నెమటోడ్స్ తదితర విభాగాల వారీగా ప్రతినెలా ఒకరోజు వేమగిరి పరిశోధనా కేంద్రంలో అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అంతకు ముందు డాక్టర్ ప్రసాద్, శాస్త్రవేత్తల బృందానికి అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఉపాధ్యక్షులు పెనుమాక బుల్లికొండయ్య, అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.


నర్సరీ రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్, చిత్రంలో శాస్త్రవేత్తలు, రైతులు

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు


వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-2, రూ.20.80 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ హెల్త్-వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్రామ సచివాలయం-2 కన్వీనర్లు పెనుమాక సునీల్, కొత్తపల్లి నాగేశ్వరరావు, ఆచంట రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావు, కాతేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నాగదుర్గ, మాజీ సర్పంచ్ ఆచంట సుబ్బారాయుడు, సొసైటీ అధ్యక్షుడు ఆచంట కళ్యాణ్, పార్టీ నాయకులు యెజ్జు వాసు, మద్దా దుర్గారావు, మేకల సూర్యారావు, దొండపాటి సంసోను, పోసుపో రత్నం రాజు, కంకిపాటి రాజు, బూర దిలీప్, నాగేష్ పాల్గొన్నారు.

ప్రజలందరి ఆర్థికాభ్యున్నతే లక్ష్యం


ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కాతేరులో గడప గడపకూ..

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు గ్రామసచివాలయం-2 పరిధిలో గురువారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. నాగేశ్వర్ మాట్లాడుతూ కాతేరు గ్రామ సచివాలయం-2 పరిధిలో నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు పంపిణీ చేయడంతో పాటు, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జగన్‌ను మరోసారి సీఎంగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం-2 కన్వీనర్లు కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, ఆచంట రవీంద్ర, సొసైటీ అధ్యక్షుడు ఆచంట కళ్యాణ్, పార్టీ నాయకులు యెజ్జు శ్రీనివాస్, మద్దా దుర్గారావు, మేకల సూర్యారావు, దొండపాటి సంసోను, పోసుపో రత్నంరాజు, కంకిపాటి రాజు, బూర దిలీప్, నాగేష్, కొల్లి నాని, జయరాజు, మానుపాటి వెంకట్రావు, నక్కా ధనరాజు, దేవమాత, చీకట్ల రంజిత్ పాల్గొన్నారు.

గుబ్బల రాంబాబు సేవలు అభినందనీయం


గుబ్బల రాంబాబుకు అవార్డు అందజేస్తున్న మంగతాయారు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ద్వారా డాక్టర్ గుబ్బల రాంబాబు చేస్తున్న అభినందనీయమని లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ మాటూరు మంగతాయారు అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో గురువారం మధ్యాహ్నం జరిగిన లయన్స్ క్లబ్ ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022 -23లో తన పదవీ కాలంలో అత్యున్నత అన్నదాన సేవలు అందించినందుకు రాంబాబుకు ప్రతిష్టాత్మక లయన్స్ అన్నదాత అవార్డు అందిస్తున్నామన్నారు. ఆయన ఇటు స్వర్ణాంధ్ర సేవా సంస్థతో పాటు లయన్స్ క్లబ్ సేవల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారన్నారు. రాంబాబు విశేష సేవలకు గాను బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు, ఇస్కామీ ఫోరం నుంచి సిల్వర్ పేటరన్ అవార్డులను మంగతాయారు చేతుల మీదుగా రాంబాబుకు అందించారు. అలాగే లయన్స్ క్లబ్ రాజమండ్రి ప్రతినిధులు కూడా రాంబాబును సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు కొయ్యన కుమారి, నివేదిత, గ్రంధి లక్ష్మీ వసంతకుమారి, క్లబ్ రాజమహేంద్రవరం అధ్యక్షులు అడుసుమిల్లి బాబు మాధవరావు, రాఘవులు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వికాస్ ఫార్మసీ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థినికి బంగారు పతకం అందజేస్తున్న ప్రముఖులు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయం సమీపంలోని వికాస్ ఫార్మసీ కాలేజీలో గురువారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఫార్మసీ అసోసియేషన్ ఆసియా అధ్యక్షుడు రావు వడ్లమూడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాస్ని పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థానాలను అధిరోహించగలుగుతారన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. వీరికి ఎం.ఫార్మసీ విద్యను ఉచితంగా అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ భరత్ వికాశ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత, కాలేజీ చైర్మన్ చినసుబ్బారావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా.. బీఫార్మసీ విద్యార్థినులు జవ్వాది సుస్మిత, అమలదాసు మానస, ఫార్మడీ విద్యార్థినులు కొప్పిశెట్టి ఉదయ శ్రీ, సౌజన్య బంగారు పతకాలు అందుకున్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి కృషి


రామేశ్వరంలో వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

పెదపూడి: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించి ఆయా పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూర్చడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. రామేశ్వరంలో సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో చెత్త తొలగింపు పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీకం పోస్టు ఎరువును తయారీ చేసి రైతులకు విక్రయించి ఆదాయం సమకూర్చాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపరిచి ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ విషయంలో ఎక్కడైనా లోపాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో రూ.1.75 లక్షల మోసం

కంబాలచెరువు: ఆన్‌లైన్‌లో వచ్చిన లింక్ ద్వారా అధిక సొమ్ములు సంపాదించవచ్చనే ఆశతో దఫదఫాలుగా డబ్బులు కట్టి చివరికి రూ.1.75 లక్షలను ఓ యువతి పోగొట్టుకుంది. ఈ మేరకు గురువారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్థానిక రామచంద్రరావుపేటకు చెందిన ప్రశాంతికి ఈ నెల ఒకటో తేదీన ఇన్‌స్టాగామ్‌లో ఒక లింక్ వచ్చింది. అందులో రూ.400 కడితే రూ.600, రూ.1000 కడితే రూ.1500 వచ్చాయి. దీంతో ఆమె దఫదఫాలుగా సొమ్ములు వెచ్చించింది. పెద్ద మొత్తంలో సొమ్ములు చెల్లించాక అవతలి నుంచి పూర్తి సమాచారం కట్ అయిపోయింది. దీంతో మోసపోయానని తెలిసిన ఆమె మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

క్లుప్తంగా

ట్రై సైకిళ్ల పంపిణీ


ట్రై సైకిళ్లు అందజేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం ఆయన కార్యాలయంలో చందన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు అందించారు. దివ్యాంగుడు ఖండవల్లి శ్రీను, వృద్ధురాలు కర్రి నారాయణమ్మకు వీటిని పంపిణీ చేశారు. నాగేశ్వర్ మాట్లాడుతూ చందన చేయూత ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాణా హరిశ్చంద్ర, పేపకాయల హనుమంతు, కర్రి సత్తిబాబు, దారా సత్యనారాయణ, చిరంజీవి, కుంచాడ త్రిమూర్తులు, పుచ్చా ప్రసన్నకుమార్‌రెడ్డి, తీగిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోరాటాలే మార్గం

ప్రకాశం నగర్: విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ సంగ్రామ యాత్ర నాలుగో రోజు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాలలో ముగింపు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సాబ్జీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను అదాని, అంబానిలకు దోచిపెడుతోందని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, జిల్లా మాజీ కార్యదర్శులు బి.పవన్, రాజులోవ, జిల్లా అధ్యక్షుడు వి.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


విద్యార్థులతో కెనరా బ్యాంకు అధికారులు

కంబాలచెరువు: స్థానిక కోరుకొండ రోడ్డులోని కెనరా బ్యాంక్ శాఖ సౌజన్యంతో శ్రీనాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు గురువారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా ఈ పురస్కారం అందజేస్తున్నట్టు బ్యాంక్ మేనేజర్ కె.సాయి మల్లి తెలిపారు. 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున, ఐదు నుంచి ఏడు తరగతుల విద్యార్థులకు రూ.2,500 చొప్పున మొత్తం ఆరుగురికి రూ.22,500 అందజేశామన్నారు. ప్రధానోపాధ్యాయుడు చక్రధర్, కెనరా బ్యాంక్ అధికారులు ఏ.శ్రీనివాస్, టి.తేజేశ్ పాల్గొన్నారు.

పిల్లల్లో సోదరభావం పెంపొందించాలి

కంబాలచెరువు: పిల్లల్లో సోదరభావం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. స్థానిక జిల్లా ప్రధాన న్యాయస్థానంలో గురువారం బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి సంరక్షణ పథకంపై కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తి, సోదరభావం, మంచి, చెడు స్పర్శలకు ఉన్న వ్యత్యాసం తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం అన్ని విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీటిపై వెంటనే ప్రణాళికను రూపొందించి, కార్యాచరణ ఆరంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, విద్య, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తేవాలి

కంబాలచెరువు: మహారాష్ట్ర, కర్ణాటకలో మాదిరిగానే రాష్ట్రంలో కూడా మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎం.మల్లికార్జున రావు పిలుపునిచ్చారు. స్థానిక ఆనంద నగర్ మున్సిపల్ హైస్కూల్లో నేషనల్ సైంటిఫిక్ డే ఉత్సవాల సందర్భంగా నరేంద్ర దభోల్కర్ సంస్మరణ సభను గురువారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. శాస్త్రవేత్తల జీవితాలను అధ్యయనం చేస్తూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.తాతారావు, రవిబాబు, సీహెచ్‌వీ సూర్యం పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

రాజమహేంద్రవరం రూరల్: కుక్క అడ్డుగా రావడంతో మోటార్ సైకిల్ నుంచి పడిపోయి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హుకుంపేటకు చెందిన కఠారి అర్జున్, అతడి స్నేహితుడు మురళీ మోటారు సైకిల్‌పై బుధవారం రాత్రి ఆటోనగర్ వెళ్లారు. తిరిగి వస్తుండగా లాలాచెరువు ఆప్కో షోరూమ్ దాటిన తరువాత కుక్క అడ్డురావడంతో కింద పడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అర్జున్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ బాధితుడికి ఎంపీ భరత్ రామ్ భరోసా


రామస్వామికి భరోసా కల్పిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సీటీఆర్ఐ సుబ్బారావు నగర్ కమ్యూనిటీ హాలు సమీపంలో నివసిస్తున్న కార్పెంటర్, వైఎస్సార్ సీపీ కార్యకర్త 35 ఏళ్ల ఏలూరి రామస్వామి రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు ఎంపీ మార్గాని భరత్ రామ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ వెంటనే రామస్వామి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుసుకుని, కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కిడ్నీ ఇచ్చేందుకు రామస్వామి తల్లి మణి ముందుకు రావడంతో విశాఖ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయనున్నారు. అయితే ఈ ఆపరేషన్‌కు కావాల్సిన అనుమతులపై ఆర్డీవో, తహసీల్దార్, ఆరోగ్యశ్రీ అధికారులతో ఎంపీ భరత్ స్వయంగా మాట్లాడారు. రామస్వామి ఆరోగ్యంపై కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

జక్కల నాగేశ్వరరావు మృతి తీరని లోటు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు, ప్రస్తుత త్రీమెన్ కమిటీ సభ్యుడు జక్కల నాగేశ్వరరావు మృతి తీరని లోటని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. గురువారం ఆయన రాజవోలులో జక్కల నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. వీర్రాజు వెంట రాజవోలు సొసైటీ అధ్యక్షుడు గిరిజాల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, సింహాద్రి రామలక్ష్మి ఉన్నారు.

దారిలో అడ్డగించి నగదు చోరీ

రాజమహేంద్రవరం రూరల్: మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ముగ్గురు అడ్డగించి, రూ.18,600 లాక్కున్న సంఘటన ఆటోనగర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గండేపల్లి మండలం మురారికి చెందిన మాదిరెడ్డి సాయికిరణ్ రెండేళ్ల నుంచి ఆటోనగర్‌లో శివ ఆటో మొబైల్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో బైక్‌పై పుష్కరవనం నుంచి ఆటోనగర్ వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఒక వ్యక్తి బైక్‌ను ఆపగా, ఇంతలో మరో ఇద్దరు వెనుక నుంచి వచ్చి గట్టిగా పట్టుకుని బ్యాగ్‌లోని రూ.18,600 లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

ధవళేశ్వరం: స్థానిక ఐఒసిల్ కాలనీకి చెందిన కరాచీ లోవరాజు (27) తనకు వివాహం చేయడం లేదని తండ్రితో గొడవపడి ఈనెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం లోవరాజు తండ్రి గౌరీశంకర్ ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పశు మాంసం స్వాధీనం

అనపర్తి: సామర్లకోట నుంచి రాజమహేంద్రవరానికి వాహనంలో తరలిస్తున్న సుమారు టన్ను పశు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. ఓ వ్యాన్‌లో మాంసం అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో స్థానిక కెనాల్ రోడ్డులో సిబ్బంది, మధ్యవర్తులతో కలసి తనిఖీలు చేశామన్నారు. దీనిని గమనించిన వ్యాన్ డ్రైవర్ పోలీసు సిబ్బంది నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడన్నారు. సిబ్బంది సాయంతో వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో పశు మాంసాన్ని గుర్తించినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మాంసాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

సినిమాలు



శ్యామల	బెదురులంక 2012
సూర్యమినీ	డ్రీమ్‌గర్ల్-2
స్వామి	భోళాశంకర్
శివజ్యోతి	బెదురులంక 2012
అనుశ్రీ	కింగ్ ఆఫ్ కొత్త
రాజా	గాండీవధారి అర్జున
అశోక	జైలర్
ఊర్వశి	గాండీవధారి అర్జున
రంభ	బేబి
మేనక	ఏం చేస్తున్నావ్
భూతాలబంగళా	
అప్సర	బాయ్స్‌హాస్టల్
నామవరం	
వీఎస్ మహల్	గాండీవధారి అర్జున
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	గాండీవధారి అర్జున
కడియం	
వెంకటసూర్య	గాండీవధారి అర్జున